



PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు



సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దిన పత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.



| సోమవారం 10 ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి:02 సంచిక :69 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|





## బోనాల పండుగ సందర్భంగా ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు

హైదరాబాద్ | ఆగస్టు 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. శక్తి స్వరూపిణి, లాల్ దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి అమ్మవారి కరుణాకటాక్షాలు ప్రతి కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఇంటా ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం, సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రజలందరూ సుఖశాంతులతో, ఐకమత్యంతో, సౌభాగ్యంతో జీవించాలని ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని కొలుస్తూ మన సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటుతూ బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి కోరారు.

## ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు




హైదరాబాద్ | ఆగస్టు 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ప్రకృతిని దైవంగా, అడవిని తల్లిగా భావిస్తూ తమ సంస్కృతి, సంప్రదాయాలను తరతరాలుగా కాపాడుకుంటున్న ఆదివాసీ సోదర సోదరీమణులకు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ నాగరికతకు మూలం, ప్రకృతితో మమేకమైన జీవన విధానం ఆదివాసీ సంస్కృతి అని పేర్కొన్నారు. తరతరాలుగా ప్రకృతి పరిరక్షణను తమ జీవన విధానంగా మలుచుకున్న ఆదివాసీ సమాజాల జ్ఞానం, సంస్కృతి, సంప్రదాయాలు, సమిష్టి జీవన విధానం, సాంస్కృతిక పరిరక్షణ యావత్ మానవాళికి మార్గదర్శకమని అన్నారు. ఆదివాసీల హక్కులు, అస్తిత్వం, సంస్కృతిని గౌరవిస్తూ వారి సంక్షేమం, అభివృద్ధి, ఆత్మగౌరవం కోసం ప్రతి ఒక్కరూ కలిసి నిలబడాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

## తొలిసారిగా వీడియోలో కనిపించిన ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ



టెహ్రాన్ | ఆగస్టు 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ తొలిసారిగా ఓ వీడియోలో కనిపించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై తీవ్ర ఊహాగానాలు కొనసాగుతున్న వేళ, అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారంటూ వార్తలు వెలువడిన నేపథ్యంలో ఈ వీడియో విడుదల కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇరాన్‌కు చెందిన ప్రభుత్వ అనుబంధ మీడియా సంస్థ మెహర్ న్యూస్ ఈ వీడియోను విడుదల చేసినట్లు సమాచారం. వీడియోలో మొజ్తబా ఖమేనీ కొందరితో కలిసి కనిపించగా, ఆయన ఆరోగ్యంగా ఉన్నట్లుగా కనిపించారు. అయితే ఈ వీడియో ఎప్పుడు, ఎక్కడ చిత్రీకరించారనే వివరాలను ఇరాన్ మీడియా వెల్లడించలేదు. దీంతో వీడియో తాజాగా చిత్రీకరించిందా లేదా గతంలో తీసినదా అనే చర్చ కొనసాగుతోంది. ఇటీవల మొజ్తబా ఖమేనీ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని, ఆయనను ఆసుపత్రికి తరలించారంటూ పలు వార్తలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో ఆయన ఆరోగ్యంపై జరుగుతున్న ప్రచారానికి తెరదించేందుకే ఇరాన్ ప్రభుత్వం ఈ వీడియోను విడుదల చేసి ఉండవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే వీడియో ఆధారంగా మాత్రమే ఆయన ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై పూర్తి నిర్ధారణకు రావడం సాధ్యం కాదని అంతర్జాతీయ మీడియా పేర్కొంటోంది.



## ఆదివాసీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది: పవన్ కల్యాణ్

అమరావతి | ఆగస్టు 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ప్రకృతిని పూజించే అడవితల్లి బిడ్డలు, మన సంస్కృతి పరిరక్షకులైన ఆదివాసీలకు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ శుభాకాంక్షలను ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కల్యాణ్ తెలిపారు. ఆదివాసీలను కేవలం ఓట్ల కోసమో, జనాభా లెక్కల కోసమో కాకుండా సమాజంలో అందరిలాగే వారికి అన్ని మౌలిక సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ఆదివాసీల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం 'అడవితల్లి బాట' కార్యక్రమం ద్వారా గిరిజన ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆదివాసీల అభ్యున్నతి, సంక్షేమం, గౌరవప్రదమైన జీవనం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.



## తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక బోనాల పండుగ

హైదరాబాద్ | ఆగస్టు 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): భక్తి, విశ్వాసం, సంస్కృతి, తరతరాల ఆచార సంప్రదాయాలు కలగలిసిన తెలంగాణ ఆత్మగౌరవానికి బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆషాఢమాసం చివరి ఆదివారం బోనాల జాతర ముగింపు ఉత్సవాల సందర్భంగా సికింద్రాబాద్‌లోని చిలకలగూడ శ్రీ కట్టమైసమ్మ–పోచమ్మ దేవాలయంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవార్ల కృపాకటాక్షాలు, ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా కళకళలాడాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు. అనంతరం యూసఫ్‌గూడ భవానీనగర్‌లోని శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో స్థానిక శాసనసభ్యుడు నవీన్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిన్న శ్రీశైలం యాదవ్, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## కట్టమైసమ్మ–పోచమ్మ అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి పొంగులేటి



సికింద్రాబాద్ | ఆగస్టు 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సికింద్రాబాద్ చిలకలగూడలోని శ్రీ కట్టమైసమ్మ–పోచమ్మ దేవాలయంలో నిర్వహించిన బోనాల ఉత్సవాలకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. బోనాల జాతరకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు, పూజారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో మంత్రి పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి కృపాకటాక్షాలు, ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా కళకళలాడాలని అమ్మవారిని ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు.



## ఆకాశమే హద్దుగా సాగుతున్న దేశ యువత

న్యూఢిల్లీ | ఆగస్టు 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): దేశ యువత తమ అద్భుతమైన ఆవిష్కరణలతో అంతరిక్ష రంగంలో నూతన అధ్యాయాన్ని లిఖిస్తున్నారని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. యువత 'ఆస్ట్రోబేస్' రూపొందించిన 'ఎవరెస్ట్' వంటి స్వదేశీ ఎఫ్‌ఎఫ్‌ఎస్సీ రాకెట్ ఇంజిన్లను తయారు చేస్తూ దేశ అంతరిక్ష రంగానికి కొత్త దిశానిర్దేశం చేస్తున్నారని పేర్కొన్నారు. యువత కృషి, పట్టుదల భారతదేశ అంతరిక్ష కలలకు సరికొత్త రెక్కలు తొడిగి, ప్రపంచ వేదికపై దేశ కీర్తిని మరింత ఎత్తుకు తీసుకెళ్తున్నాయని ప్రధానమంత్రి అన్నారు. యువత ప్రతిభ, ఆవిష్కరణలు, సాంకేతిక నైపుణ్యాలు భారత అంతరిక్ష రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయని తెలిపారు.



## సాధారణ ప్రజలకు యూపీఐ సేవలు ఎప్పటికీ ఉచితమే

న్యూఢిల్లీ | ఆగస్టు 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పన్నుల, ఇతర చట్టాల సవరణ బిల్లు–2026 ప్రకారం సాధారణ ప్రజలు, చిన్న వ్యాపారులకు యూపీఐ సేవలు ఎప్పటికీ 100 శాతం ఉచితంగానే అందుబాటులో ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. దేశ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను మరింత భద్రంగా, వేగవంతంగా మార్చే లక్ష్యంతో ఈ చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు పేర్కొంది. యూపీఐ లావాదేవీలకు సంబంధించి ప్రజల్లో ఎలాంటి అపోహలు, తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని, వాస్తవాలను మాత్రమే విశ్వసించాలని సూచించింది.

## క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలి: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ | ఆగస్టు 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): చారిత్రాత్మక క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ స్మరించుకుంటూ వారి ధైర్యం, త్యాగాలు ప్రతి భారతీయుడికి ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తాయని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. మహాత్మా గాంధీ నాయకత్వంలో క్విట్ ఇండియా ఉద్యమానికి ఇచ్చిన పిలుపు భారత స్వాతంత్ర్య పోరాటంలో నూతన శక్తిని నింపిందని, వలస పాలన నుంచి విముక్తి పొందాలన్న భారత ప్రజల అచంచల సంకల్పాన్ని ప్రతిబింబించిందని పేర్కొన్నారు. దేశ త్రివర్ణ పతాకం ప్రతి భారతీయుడి గర్వానికి ప్రతీకగా, దేశం కోసం ఎల్లప్పుడూ అత్యుత్తమంగా పనిచేయాలనే స్ఫూర్తికి మూలంగా నిలుస్తుందని ప్రధాని తెలిపారు. 'హర్ ఘర్ తిరంగా' ఉద్యమంలో ప్రజలందరూ ఉత్సాహంగా పాల్గొని, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణానికి తమ వంతు కృషి చేయాలనే సామూహిక సంకల్పాన్ని పునరుద్ధరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాది 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని 'వందే మాతరం'కు అంకితం చేయడం, వందే మాతరం 150వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న నేపథ్యంలో ఈ కార్యక్రమానికి మరింత ప్రత్యేకత ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.




## వైద్య విద్యార్థిని ప్రియాంక మృతి తీవ్ర విషాదకరం కఠిన చర్యలు తీసుకుంటాం

రాజమహేంద్రవరం | ఆగస్టు 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రాజమహేంద్రవరంలో యువకులు తీవ్ర నిర్లక్ష్యంతో, మద్యం మత్తులో కారుతో ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడిన వైద్య విద్యార్థిని ప్రియాంక మృతి చెందడం తీవ్ర విచారం కలిగించిందని సంబంధిత ప్రజాప్రతినిధి పేర్కొన్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న వైద్య విద్యార్థిని ఇలా ప్రాణాలు కోల్పోవడం తనను కలచివేసిందని, ఈ ఘటన అత్యంత బాధాకరమని అన్నారు. ప్రియాంక మృతికి కారణమైన నిందితులను ఇప్పటికే అరెస్టు చేసి జైలుకు తరలించామని తెలిపారు. నిర్లక్ష్యంగా వాహనం నడిపి నిండు ప్రాణాన్ని బలిగొన్న నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని, ఈ విషయంలో ఇప్పటికే పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని పేర్కొన్నారు. నిందితులపై కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి చట్టప్రకారం శిక్ష పడేలా చూస్తామని తెలిపారు. ప్రియాంక కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.



## పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన కేసీఆర్

నల్లబెల్లి | ఆగస్టు 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): తెలంగాణ ఉద్యమ నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఉద్యమకాల సహచరుడు స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మరణంతో విషాదంలో ఉన్న ఆయన కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పరామర్శించి ఓదార్చారు. ఎర్రవెల్లి నివాసం నుంచి నల్లబెల్లికి బయలుదేరిన కేసీఆర్‌కు మార్గమధ్యంలో భువనగిరి, ఆలేరు, బచ్చుపేట తదితర ప్రాంతాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో స్వాగతం పలికారు. గ్రామాలు, పట్టణాల కూడళ్లలో అభిమానులు భారీగా తరలివచ్చి 'జై తెలంగాణ', 'జై కేసీఆర్' అంటూ నినాదాలు చేస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం నర్సంపేట నియోజకవర్గంలోని నల్లబెల్లికి చేరుకున్న కేసీఆర్, పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి చొప్పున, ఆయన తల్లికి రూ.25 లక్షల చొప్పున చెక్కులు అందజేసినట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. కేసీఆర్ వెంట పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.



## శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద.. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

హైదరాబాద్ | ఆగస్టు 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. జలాశయంలోకి 44,279 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 4,563 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రస్తుత నీటిమట్టం 878 అడుగులుగా ఉండగా, పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులుగా ఉంది. మరోవైపు తెలంగాణలోని పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. హైదరాబాద్, కామారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి, మెదక్ జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని, ములుగు, నల్గొండ, నారాయణపేట, సంగారెడ్డి, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో వర్ష సూచన ఉన్నట్లు తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.



## రామ్‌జీ పథకం లబ్ధికి ఆధార్ ధ్రువీకరణ తప్పనిసరి

న్యూఢిల్లీ | ఆగస్టు 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): వీబీజీ రామ్‌జీ పథకం కింద ప్రయోజనాలు పొందాలంటే ఆధార్ అథెంటికేషన్ తప్పనిసరిగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆధార్ అందుబాటులో లేని 18 ఏళ్లు పైబడిన అర్హులు ఓటర్ గుర్తింపు కార్డు, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్, పదో తరగతి ధ్రువపత్రం లేదా డ్రైవింగ్ లైసెన్స్ వంటి ప్రత్యామ్నాయ గుర్తింపు పత్రాలతో నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించింది. పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు సంవత్సరానికి 125 రోజుల వరకు ఉపాధి హామీ కల్పించే విధంగా నిబంధనలు ఉన్నాయని కేంద్రం తెలిపింది.



## ఏడు ఏళ్లలోపు వివాహిత మృతి.. వరకట్న వేధింపులు ఉంటే 'వరకట్న మరణం': అలహాబాద్ హైకోర్టు

లక్నో | ఆగస్టు 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): వివాహమైన ఏడు సంవత్సరాల్లోపు మహిళ అసహజ పరిస్థితుల్లో మృతి చెంది, ఆమె మరణానికి ముందు భర్త లేదా అత్తింటి బంధువుల నుంచి వరకట్నం కోసం వేధింపులు జరిగినట్లు నిరూపితమైతే, ఆ మరణాన్ని చట్టపరంగా వరకట్న మరణంగా పరిగణించవచ్చని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. వరకట్న మరణానికి సంబంధించిన నిబంధనల్లో మహిళ మరణం వివాహం జరిగిన ఏడు సంవత్సరాల్లోపు సంభవించడం, మరణానికి ముందు వరకట్నం కోసం భర్త లేదా అతని బంధువుల నుంచి వేధింపులు జరిగినట్లు నిర్ధారణ కావడం కీలక అంశాలని కోర్టు పేర్కొంది. ఈ కేసులో నిందితుడు సందీప్ సింగ్‌పై నమోదైన వరకట్న మరణం కేసును విచారించిన హైకోర్టు, దిగువ కోర్టు విధించిన జీవిత ఖైదు శిక్షను పరిశీలించింది. జీవిత ఖైదు విధించడానికి దిగువ కోర్టు తగిన కారణాలను స్పష్టంగా నమోదు చేయలేదని అభిప్రాయపడుతూ, శిక్షను 10 సంవత్సరాల కారాగార శిక్షకు తగ్గించినట్లు కోర్టు తీర్పులో పేర్కొంది.



## కామన్వెల్త్ గేమ్స్‌లో భారత క్రీడాకారుల అద్భుత ప్రదర్శన

న్యూఢిల్లీ | ఆగస్టు 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): కామన్వెల్త్ గేమ్స్–2026లో భారత అథ్లెట్లు సత్తాచాటారు. భారత్ మొత్తం 39 పతకాలను సాధించగా, ఇందులో 13 స్వర్ణాలు, 17 రజతాలు, 9 కాంస్య పతకాలు ఉన్నాయి. ఈ ఘన విజయాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ వేదికపై అథ్లెట్లు కనబరిచిన ప్రతిభ, పట్టుదల దేశం గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో జరిగే పోటీల్లోనూ క్రీడాకారులు మరింత మెరుగైన ప్రదర్శనతో దేశానికి మరిన్ని విజయాలు అందించాలని ప్రధాని ఆకాంక్షించారు.

## ఆకాశంలో ఎగిరే కారు.. యువ ఆవిష్కర్త సరికొత్త ప్రయోగం



అల్మోరా | ఆగస్టు 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఉత్తరాఖండ్‌లోని అల్మోరాకు చెందిన యువ ఆవిష్కర్త రవి టమ్టా తన 'హపిడా స్కైనెక్స్' సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన సింగిల్ సీటర్ ఎగిరే కారు నమూనాను విజయవంతంగా పరీక్షించినట్లు సమాచారం. భవిష్యత్ రవాణా రంగంలో కొత్త అవకాశాలకు ఈ ప్రయోగం నాంది పలుకుతుందని పేర్కొంటున్నారు. స్వదేశీ యువత సాంకేతిక ఆలోచన, నైపుణ్యం, ఆవిష్కరణలతో ఆధునిక రవాణా రంగంలో కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారని, దేశీయ ప్రతిభకు సరైన ప్రోత్సాహం లభిస్తే మరిన్ని వినూత్న ఆవిష్కరణలు సాధ్యమవుతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ఢిల్లీ నిరసనలపై స్పందన.. జార్ఖండ్ పేపర్ లీక్‌పై మౌనం: కాంగ్రెస్, జేఎంఎంపై విమర్శలు




న్యూఢిల్లీ | ఆగస్టు 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): కాంగ్రెస్, జేఎంఎం పార్టీలపై రాజకీయ వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆయా పార్టీలకు అనుకూలంగా ఉన్న అంశాలపై మాత్రమే స్పందిస్తూ, ఇబ్బందికరమైన పరిణామాలపై మౌనం వహిస్తున్నాయని విమర్శకులు ఆరోపిస్తున్నారు. ఢిల్లీలో జరిగిన నిరసనలను జాతీయ అత్యవసర పరిస్థితిగా అభివర్ణించే స్థాయిలో స్పందించిన కాంగ్రెస్, జార్ఖండ్‌లో పేపర్ లీక్‌కు సంబంధించిన నిరసనలపై మాత్రం పెద్దగా స్పందించలేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ అంశాలపై ఒకే విధమైన ప్రమాణాలతో స్పందించాల్సిన పార్టీలు, తమకు అనుకూలమైన సందర్భాల్లో మాత్రమే ఆందోళన వ్యక్తం చేస్తున్నాయని విమర్శకులు పేర్కొంటున్నారు. అయితే ఈ ఆరోపణలపై కాంగ్రెస్, జేఎంఎం పార్టీల అధికారిక స్పందనను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది.




## ఆధార్‌లో 36 ఏళ్ల మహిళ వయసు 102 ఏళ్లుగా నమోదు.. పింఛన్‌కు బ్రేక్

నెల్లూరు | ఆగస్టు 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఆధార్‌లో పుట్టిన తేదీ వివరాలు తప్పుగా నమోదు కావడంతో నెల్లూరు జిల్లాలోని కదిరినేనిపల్లికి చెందిన 36 ఏళ్ల నారాయణమ్మకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆమె ఆధార్‌లో వయసు ఏకంగా 102 ఏళ్లుగా నమోదైంది. భర్త మృతి అనంతరం పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న సమయంలో ఈ విషయం వెలుగులోకి రావడంతో ఆమెకు పింఛన్ మంజూరు కాలేదు. ఆధార్‌లో నమోదైన తప్పును సరిచేసుకునేందుకు ఆధార్ కేంద్రాన్ని ఆశ్రయించగా, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రంతో పాటు డెంటల్ సర్టిఫికెట్ తీసుకురావాలని సూచించినట్లు నారాయణమ్మ తెలిపింది. సంబంధిత ధ్రువపత్రాల కోసం ఆమె పలు ఆసుపత్రుల చుట్టూ తిరిగినా ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదని వాపోయింది. అధికారులు స్పందించి ఆధార్ వివరాల్లోని పొరపాటును సరిచేసి, అర్హత ఉంటే పింఛన్ అందేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరుతోంది.




## ఈఎంఐ బకాయిలపై మొబైల్ లాక్‌కు పరిమితులు.. వినియోగదారులకు రక్షణ

న్యూఢిల్లీ | ఆగస్టు 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఈఎంఐ బకాయిల పేరుతో మొబైల్ ఫోన్లు, ట్యాబ్లెట్లు, ల్యాప్‌టాప్‌లపై రుణదాతలు తీసుకునే చర్యలకు సంబంధించి వినియోగదారుల హక్కులు, డిజిటల్ రుణాల నిబంధనలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. రుణం కోసం వినియోగదారుల వ్యక్తిగత సమాచారాన్ని అవసరానికి మించి సేకరించకూడదని, డిజిటల్ లెండింగ్‌లో డేటా సేకరణకు ముందస్తు, స్పష్టమైన సమ్మతి అవసరమని ఆర్‌బీఐ నిబంధనలు చెబుతున్నాయి. ఈఎంఐ బకాయిల కారణంగా పరికరాలను వెంటనే పూర్తిగా లాక్ చేయవచ్చన్న ప్రచారాన్ని వినియోగదారులు నిబంధనలు, రుణ ఒప్పందంలోని షరతులతో సరిపోల్చి చూడాలి. పరికరం కొనుగోలుకు తీసుకున్న రుణాల విషయంలో రుణదాతకు ఉన్న హక్కులు ఒప్పంద నిబంధనలు, వర్తించే చట్టాలు, ఆర్‌బీఐ మార్గదర్శకాల పరిధిలోనే ఉండాలి. వ్యక్తిగత డేటాను రుణ వసూళ్ల కోసం అనధికారికంగా వినియోగించకూడదన్న రక్షణలు డిజిటల్ రుణ నిబంధనల్లో ఉన్నాయి.



## హైవేపై రక్తగాయాలతో మృతదేహం.. రోడ్డు ప్రమాదం అనుకున్నా హత్య కోణంలో దర్యాప్తు

పీలేరు | ఆగస్టు 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): అన్నమయ్య జిల్లా పీలేరులో ఓ వ్యక్తి అనుమానాస్పద మృతి కలకలం రేపింది. డిష్ కాలనీకి చెందిన సుబ్రహ్మణ్యం (47) మృతదేహం తిరుపతి హైవేపై రక్తగాయాలతో కనిపించడంతో తొలుత స్థానికులు రోడ్డు ప్రమాదంగా భావించారు. అయితే మృతుడి తండ్రి కృష్ణయ్య ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు హత్య కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. తన కోడలు ఉమాదేవిపై అనుమానం ఉందని కృష్ణయ్య ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. సుబ్రహ్మణ్యానికి, ఉమాదేవికి సుమారు 20 ఏళ్ల క్రితం వివాహం కాగా, కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. కుమారుడిని, కోడలిని, మనవడిని ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించినా స్పందన లేకపోవడంతో పీలేరుకు వచ్చిన కృష్ణయ్యకు ఇంటికి తాళం వేసి ఉండటం, ఉమాదేవి, ఆమె కుమారుడు లోహిత్ కనిపించకపోవడంతో అనుమానం మరింత బలపడినట్లు తెలుస్తోంది. పోలీసులు ఇంటి నుంచి హైవే వరకు పరిసరాలను పరిశీలించడంతో పాటు రక్తపు మరకలు, సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఉమాదేవికి మరో వ్యక్తితో సంబంధం ఉందన్న మృతుడి తండ్రి ఆరోపణపైనా పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ కృష్ణమోహన్ వెల్లడించినట్లు సమాచారం. సుబ్రహ్మణ్యం మృతదేహాన్ని హైవేపై పడేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం జరిగిందా, ఘటనలో మరెవరైనా ప్రమేయం ఉందా అనే కోణాల్లోనూ విచారణ కొనసాగుతోంది. నిందితులపై ఆరోపణలు ఇంకా దర్యాప్తు దశలోనే ఉండటంతో, పోలీసుల తుది విచారణ అనంతరం హత్యకు దారితీసిన అసలు కారణాలు, ఘటనలో ఎవరెవరి ప్రమేయం ఉందన్న విషయాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది.

## స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో ఢిల్లీలో భద్రత కట్టుదిట్టం

న్యూఢిల్లీ | ఆగస్టు 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీలో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేశారు. ఉగ్రవాద ముప్పును దృష్టిలో ఉంచుకుని 'సుదర్శన్ శక్తి–V' పేరుతో కౌంటర్ టెర్రరిజం మాక్ డ్రిల్ నిర్వహించినట్లు సమాచారం. జాతీయ భద్రతా దళం, ఢిల్లీ పోలీసుల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ విన్యాసాల్లో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పరీక్షించినట్లు తెలుస్తోంది. ఎర్రకోటతో పాటు రాజధానిలోని కీలక ప్రాంతాల వద్ద భద్రతను పెంచి, అనుమానాస్పద కదలికలపై నిఘా కొనసాగిస్తున్నారు.



## రిజర్వేషన్ బోగీల్లో అక్రమ ప్రవేశంపై రైల్వే శాఖ కఠిన చర్యలు

హైదరాబాద్ | ఆగస్టు 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రిజర్వేషన్ బోగీల్లో అనధికారికంగా ప్రయాణించే వారిపై దక్షిణ మధ్య రైల్వే కఠిన చర్యలకు సిద్ధమైంది. సరైన రిజర్వేషన్ టికెట్ లేకుండా రిజర్వుడ్ కోచ్‌లోకి ప్రవేశించిన వారికి నిబంధనల ప్రకారం రూ.2,000 వరకు జరిమానా విధించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికుల ప్రయాణానికి అంతరాయం కలిగించినా జరిమానా విధించే అవకాశం ఉందని పేర్కొన్నారు. విధించిన జరిమానాను చెల్లించని పక్షంలో న్యాయస్థానం ద్వారా అదనపు జరిమానా విధించే అవకాశం ఉంటుందని అధికారులు హెచ్చరించారు. జనరల్ టికెట్ కలిగిన ప్రయాణికులు రిజర్వేషన్ బోగీల్లోకి ప్రవేశించకుండా నిబంధనలు పాటించాలని దక్షిణ మధ్య రైల్వే సూచించింది.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం.. చిట్వేలి యువకుడు దిలీప్‌కుమార్ మృతి



చిట్వేలి | ఆగస్టు 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్నమయ్య జిల్లా చిట్వేలి మండలం జెట్టివారిపల్లికి చెందిన బొంగు టావుల దిలీప్‌కుమార్ మృతి చెందారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కోసం సుమారు ఐదు నెలల క్రితమే దిలీప్‌కుమార్ అమెరికా వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మృతి చెందినట్లు సమాచారం అందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. దిలీప్‌కుమార్ మృతితో జెట్టివారిపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. యువకుడి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నట్లు సమాచారం.

## మీడియాకు స్మార్ట్ అక్రిడిటేషన్.. QR కోడ్‌తో జర్నలిస్టుల గుర్తింపు




నెల్లూరు | ఆగస్టు 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మీడియా ప్రతినిధుల గుర్తింపు ప్రక్రియను మరింత పారదర్శకంగా, వేగవంతంగా, సురక్షితంగా మార్చే లక్ష్యంతో నెల్లూరు జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల, ఐపీఎస్ ఆధ్వర్యంలో QR కోడ్ ఆధారిత స్మార్ట్ మీడియా అక్రిడిటేషన్ విధానాన్ని ప్రారంభించారు. ప్రత్యేక QR కోడ్‌తో కూడిన డిజిటల్ పాస్ ద్వారా జర్నలిస్టుల వివరాలను క్షణాల్లో ధ్రువీకరించే అవకాశం కల్పించినట్లు అధికారులు తెలిపారు. ఈ విధానం ద్వారా నకిలీ మీడియా గుర్తింపు కార్డులకు అడ్డుకట్ట వేయడంతో పాటు, అసలైన మీడియా ప్రతినిధుల గుర్తింపు ప్రక్రియ మరింత సులభతరం కానుంది. మీడియా ప్రతినిధుల అభ్యర్థన మేరకు సోమవారం కూడా నెల్లూరులోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో QR కోడ్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎస్పీ వెల్లడించారు. ఇదే తరహా స్మార్ట్ మీడియా అక్రిడిటేషన్ విధానాన్ని త్వరలో తిరుపతిలోనూ అందుబాటులోకి తీసుకురానున్నట్లు సమాచారం.



## పామిడి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం.. 40 మందికి గాయాలు

అనంతపురం | ఆగస్టు 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): అనంతపురం జిల్లా పామిడి సమీపంలోని పొగురూరు బ్రిడ్జిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బ్రిడ్జిపై వెళ్తున్న బస్సును ఐచర్ వాహనం ఢీకొట్టడంతో ప్రమాదం జరిగినట్లు సమాచారం. అనంతరం ఐచర్ వాహనం డివైడర్‌ను ఢీకొని అదుపుతప్పడంతో బస్సు, ఐచర్ వాహనం రెండూ బ్రిడ్జిపై నుంచి కింద పడినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో సుమారు 40 మంది గాయపడగా, వారిలో 10 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం కారణంగా హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ప్రమాదానికి దారితీసిన పూర్తి కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



## కన్న కూతురిపై లైంగిక దాడి.. తండ్రిపై పోక్సో కేసు

హైదరాబాద్ | ఆగస్టు 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కన్న కూతురిపై లైంగిక దాడికి పాల్పడ్డాడనే ఆరోపణలపై ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ముగ్గురు కుమార్తెలతో కలిసి నివసిస్తున్న కుటుంబానికి చెందిన 45 ఏళ్ల వ్యక్తి హౌస్‌కీపింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడని, మద్యానికి బానిసై తరచూ భార్య, పిల్లలతో గొడవ పడేవాడని సమాచారం. ఈ క్రమంలో మద్యం మత్తులో తన రెండో కుమార్తురాలిపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో పలుమార్లు బాలికపై లైంగిక దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలుస్తోంది. కుటుంబ పరువు పోతుందనే ఉద్దేశంతో తొలుత విషయం బయటకు రాకుండా కుటుంబ సభ్యులు ప్రయత్నించినప్పటికీ, నిందితుడి వేధింపులు కొనసాగడంతో బాలిక పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. బాధితురాలి ఫిర్యాదు మేరకు సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. ఘటనపై పోలీసులు తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.




## మర్వేల్లిలో రేణుక మాతకు ఘనంగా బోనాల ఊరేగింపు

వట్‌పల్లి | ఆగస్టు 10 (సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ టి. సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం మర్వేల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక మాతకు బోనాల ఊరేగింపును భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలను తలపై ఎత్తుకుని మేళతాళాలు, శివసత్తుల చప్పుళ్ల మధ్య గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి రేణుక మాతకు బోనాలు సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించి గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. బోనాల ఊరేగింపుతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు టవర్స్‌కు భారీ స్పందన.. 7,340 ఇళ్లకు 35,125 దరఖాస్తులు

హైదరాబాద్ | ఆగస్టు 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): హైదరాబాద్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకానికి భారీ స్పందన లభిస్తోంది. 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్మించనున్న 7,340 ఇళ్ల కోసం ఇప్పటివరకు 35,125 దరఖాస్తులు వచ్చినట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి. గౌతం తెలిపారు. దరఖాస్తులకు మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉండటంతో అర్హులైన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ పథకం ద్వారా మార్కెట్‌లో అధిక ధర పలికే ఫ్లాట్లను ప్రజలకు రూ.6 లక్షలకే అందించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు సమయంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని, ఇల్లు కేటాయింపు జరగని దరఖాస్తుదారులకు రూ.10 వేల ధరావతు రుసుమును తిరిగి చెల్లిస్తామని స్పష్టం చేశారు. ఆగస్టు 20 తర్వాత లాటరీ ద్వారా ఇళ్ల కేటాయింపు ప్రక్రియ ప్రారంభించేందుకు ప్రాథమికంగా నిర్ణయించినట్లు, నిర్మాణాలను ఏడాదిలోగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్లు టవర్స్‌పై సందేహాల నివృత్తికి 040-24603572 నంబర్‌ను సంప్రదించవచ్చని అధికారులు సూచించారు.



## వరుణుడి కరుణ కోసం నాగార్జునసాగర్‌లో మహాయాగం

నాగార్జునసాగర్ | ఆగస్టు 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): తెలంగాణలో సమృద్ధిగా వర్షాలు కురిసి కృష్ణా, గోదావరి నదులకు స్థిరమైన ప్రవాహాలు రావాలని ఆకాంక్షిస్తూ నాగార్జునసాగర్‌లో రాష్ట్ర ప్రభుత్వం వరుణ యాగాన్ని నిర్వహిస్తోంది. విజయవిహార్ ప్రాంగణంలో 11 హోమగుండాలతో 108 మంది రుత్వికులు, అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక వైదిక కార్యక్రమాలు చేపట్టనున్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి యాగంలో పాల్గొననుండగా, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కార్యక్రమానికి నేతృత్వం వహించనున్నారు. రాష్ట్రంతో పాటు కృష్ణా, గోదావరి ఎగువ పరీవాహక ప్రాంతాల్లో సకాలంలో విస్తారమైన వర్షాలు కురిసి జలాశయాలు, చెరువులు నిండాలని, భూగర్భ జలాలు పెరగాలని, రైతాంగానికి సాగునీటి కొరత లేకుండా చూడాలన్న సంకల్పంతో యాగం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం నాగార్జునసాగర్‌లో నీటి నిల్వ పూర్తి సామర్థ్యానికి గణనీయంగా తక్కువగా ఉండటంతో ఎగువ ప్రాంతాల నుంచి మరింతగా వరద ప్రవాహాలు రావాల్సిన అవసరం ఉందని నీటిపారుదల వర్గాలు పేర్కొంటున్నాయి. రుతుపవనాల మిగిలిన కాలంలో తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటకల్లో కురిసే వర్షాలు కృష్ణా, గోదావరి నదుల ప్రవాహాలపై ప్రభావం చూపనున్న నేపథ్యంలో జలాశయాల పరిస్థితిపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

## అడవితో అనుబంధం కొనసాగిస్తూ అభివృద్ధిలో అగ్రస్థానానికి గిరిజనులు



హైదరాబాద్ | ఆగస్టు 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): గిరిజనులు తమ అడవి, భూమి, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూనే విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి రంగాల్లో ముందుకు సాగాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని బంజారా భవన్‌లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం, విద్య, ఉపాధి, మహిళా సాధికారతతో పాటు భాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి కింద రూ.18,745.16 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్, విద్య, సాగునీరు, నైపుణ్యాభివృద్ధి తదితర రంగాలకు నిధులను వినియోగిస్తున్నట్లు చెప్పారు. గిరిజన గురుకులాల్లోని 166 విద్యాసంస్థల్లో 83 వేల మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, 2025-26లో పదో తరగతిలో 98 శాతానికి పైగా, ఇంటర్మీడియట్‌లో 86 శాతానికి పైగా ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. 28 మంది విద్యార్థులు ఐఐటీల్లో, 23 మంది ఎన్ఐటీల్లో ప్రవేశాలు పొందగా, 167 మంది నీట్‌లో అర్హత సాధించారని పేర్కొన్నారు. గిరిజన విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధస్సు, నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ అందించి ప్రపంచస్థాయి అవకాశాలకు సిద్ధం చేయనున్నట్లు మంత్రి తెలిపారు. అటవీ ఉత్పత్తులకు విలువ జోడించడం, మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం, గిరిజన రైతులకు సాగునీటి సదుపాయాలు మెరుగుపరచడం ద్వారా కుటుంబ ఆదాయాలను పెంచే చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. పీఎం-జన్మన్ కార్యక్రమం అమలులో తెలంగాణ దేశంలో మూడో ఉత్తమ రాష్ట్రంగా నిలిచిందని తెలిపారు. గిరిజన భాషలు, కళలు, పాటలు, నృత్యాలు, సంప్రదాయ జ్ఞానాన్ని భావితరాలకు అందించేందుకు చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు. రాంజీ గోండ్ వంటి గిరిజన వీరుల చరిత్రను భావితరాలకు పరిచయం చేయడంతో పాటు హైదరాబాద్‌లో నిర్మిస్తున్న రాంజీ గోండ్ గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం ప్రాధాన్యాన్ని మంత్రి వివరించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, గిరిజన సంఘాల ప్రతినిధులు పాల్గొనగా, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కళా ప్రదర్శనలు, నృత్యాలు, ఆటపాటలు ఆకట్టుకున్నాయి. గిరిజన సంక్షేమం, విద్య, సంస్కృతి, హక్కుల పరిరక్షణ రంగాల్లో సేవలందించిన తొమ్మిది మంది ప్రముఖులు, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఈ సందర్భంగా సన్మానించారు.

## కంగ్టిలో మైనారిటీ ఫంక్షన్ హాల్‌కు స్థలం, రూ.10 లక్షల నిధులు



కంగ్టి, ఆగస్టు 10: నారాయణఖేడ్ నియోజకవర్గంలోని కంగ్టి మండల కేంద్రంలో మైనారిటీ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి కీలక ముందడుగు పడింది. ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం కేటాయించిన 10 గుంటల స్థలానికి సంబంధించిన పత్రాలతో పాటు రూ.10 లక్షల నిధుల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి తన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా మైనారిటీ వర్గాల ప్రతినిధులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఫంక్షన్ హాల్ నిర్మాణం పూర్తయితే మైనారిటీ వర్గాల ప్రజలు వివాహాలు, ఇతర సామాజిక కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు సౌకర్యం కలుగుతుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కే. రాజు, కే. శ్రీనివాసరెడ్డి, పి. మనోజ్ పటేల్, గఫార్ సాబ్, పాషుమియా, జానీ సాబ్, మైతాబ్ అలీ, ఇస్మాయిల్ సాబ్, గౌసొద్దీన్, హాజీ మైనుద్దీన్, మహమ్మద్ సాబ్, మోయిన్, ఇనుస్ ఉస్మాన్ ఖాజాసాబ్, భోలెసాబ్ షేక్ జలీల్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన సంక్షేమ గురుకులాల్లో పార్ట్‌టైమ్ ఉపాధ్యాయుల నియామకం



సంగారెడ్డి, ఆగస్టు 10: సంగారెడ్డి జిల్లా పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2026-27 విద్యా సంవత్సరానికి తాత్కాలిక ప్రాతిపదికన పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల నియామకానికి అర్హులైన ఇంగ్లిష్ మీడియం బోధనా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమ గురుకుల రీజినల్ కోఆర్డినేటర్ కె. నాగార్జున రావు తెలిపారు. డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్, పీజీటీ, టీజీటీ, స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. డిగ్రీ లెక్చరర్ పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో పీజీతో పాటు పీహెచ్‌డీ/నెట్/సెట్ అర్హత ఉన్న వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. పీజీటీ పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో పీజీ, బీఈడీ, టీజీటీ పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ, బీఈడీ, ఫిజికల్ డైరెక్టర్ పోస్టుకు డిగ్రీతో పాటు బీపీఈడీ/బీపీఎడ్ అర్హత అవసరం. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఆగస్టు 11న ఉదయం 9 గంటలకు రాజేంద్రనగర్‌లోని మానసాహిల్స్‌లో ఉన్న రీజినల్ కోఆర్డినేటర్ కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు జిరాక్స్ సెట్లతో డెమో, ఇంటర్వ్యూకు హాజరు కావాలని K. NAGARJUNA RAO, RCO TW HYD RR REGION సూచించారు. బాలికల విద్యాలయాల్లోని పోస్టులకు మహిళా అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు DCO-సంగారెడ్డి: 9849237238 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## భోగాపురం భూముల వ్యవహారంపై సంచలన ఆరోపణలు

విజయనగరం, ఆగస్టు 10: భోగాపురం విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో భూముల వ్యవహారంపై పలు సంచలన ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఓ రిటైర్డ్ ఐఏఎస్ అధికారిపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విమానాశ్రయానికి కిలోమీటర్ల దూరంలో ఉన్న సుమారు 32 ఎకరాల భూములకు సంబంధించి ఒప్పందాలు చేసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే కంచేరు ప్రాంతంలో సుమారు 20 ఎకరాల భూమిని తక్కువ ధరకు దక్కించుకునేందుకు పట్టాదారులపై ఒత్తిడి, బలప్రయోగం చేశారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. రైతులను అమరావతికి పిలిపించి బెదిరించారని, ఓ రైతుకు పదిసార్లు రెవెన్యూ నోటీసులు జారీ చేశారనే ఆరోపణలు వస్తున్నాయి. చివరకు భూ యజమానిపైనే కబ్జా కేసు నమోదు చేయించారంటూ కొందరు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలో రెవెన్యూ, పోలీసు వ్యవస్థలను ఉపయోగించుకున్నారనే విమర్శలు కూడా వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఉత్తరాంధ్ర భూములపై జరిగిన వ్యవహారాల మాదిరిగానే ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలోనూ ఇదే తరహా పరిస్థితులు కొనసాగుతున్నాయా అనే చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారంలో రాజకీయ నాయకులు, అధికారుల పాత్రపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



## నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న లింగాల కమల్‌రాజు

మధిర, ఆగస్టు 10: మధిర నియోజకవర్గం బోనకల్లు, మధిర మండలాల్లో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో మాజీ జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు పాల్గొన్నారు. మడుపల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు నీలం హనుమయ్య దంపతుల మనవరాళ్ల ఓణీల వేడుకకు హాజరైన కమల్‌రాజు చిన్నారులను ఆశీర్వదించారు. అనంతరం మోటమర్రి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు వీరబాబు తండ్రి దశదిన కర్మ కార్యక్రమానికి హాజరై ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, బీఆర్ఎస్ పట్టణ నాయకులు అరిగె శ్రీనివాసరావు, ఐలూరి ఉమామహేశ్వరరెడ్డి, ముత్తవరపు ప్యారీ, ఆళ్ల నాగబాబు, నాగులంచ రామారావు, లంకెమల్ల నాగేశ్వరరావు, వీరంశెట్టి సీతారామయ్య, గుగులోతు కృష్ణ, బోనకల్లు మండల నాయకులు పారా ప్రసాద్, వేమూరి ప్రసాద్, ఇటిక్యాల శ్రీనివాసరావు, కాకాని శ్రీనివాసరావు, బొక్క కిరణ్, చిట్టిమోదు శ్రీనివాసరావు, సురేష్, యువజన నాయకుడు తాళ్లూరి హరీశ్ తదితరులు పాల్గొన్నారు. సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్‌చార్జి శెట్టి సురేష్.

## వేణుకుమార్ కుటుంబానికి బీఆర్ఎస్ ముదిగొండ మండల కమిటీ ఆర్థిక సాయం



న్యూ లక్ష్మీపురం, ఆగస్టు 10, సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్‌చార్జి శెట్టి సురేష్: ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్ల విషయంలో తీవ్ర ఆవేదనకు గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన గడ్డం వేణుకుమార్‌ను బీఆర్ఎస్ ముదిగొండ మండల కమిటీ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా వేణుకుమార్ కుటుంబ సభ్యులను ఆయన నివాసంలో కలిసి రూ.38,500 ఆర్థిక సాయాన్ని అందజేశారు. అంతకుముందు స్థానిక సర్పంచ్ సలీమా ఖాసీం బాబు నివాసంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, మాజీ మండల అధ్యక్షుడు వాచేపల్లి లక్ష్మారెడ్డి, మాజీ మండల కార్యదర్శి గడ్డం వెంకటగౌడ్, రైతు సమన్వయ సమితి మాజీ కోఆర్డినేటర్ పోట్ల వెంకటప్రసాద్, పార్టీ సీనియర్ నాయకులు బంకా మల్లయ్య, సర్పంచ్ సలీమా తదితరులు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, యువత కష్టాల్లో ఉన్నప్పుడు వారికి అండగా నిలవడం బీఆర్ఎస్ నాయకత్వం ప్రత్యేకత అని పేర్కొన్నారు. వేణుకుమార్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన ప్రతి ఒక్కరికీ వారు కృతజ్ఞతలు తెలిపారు.



## ఏడుపాయల దుర్గమ్మను దర్శించుకున్న చింత సాయినాథ్

ఏడుపాయల, ఆగస్టు 10, సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తనయుడు చింత సాయినాథ్ ఏడుపాయల శ్రీ వనదుర్గ భవానీ మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న సాయినాథ్‌కు అర్చకులు ఘన స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని సాయినాథ్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, పార్టీ నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బోనాలు





రాయికోడ్, ఆగస్టు 10, సందేశం టైమ్స్ ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం చేర్లరాయిపల్లి గ్రామంలో మైసమ్మ, పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలను గ్రామస్తులు ఆదివారం భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని గ్రామ సర్పంచ్ కాశి బస్వరాజు పాటిల్ అన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. గ్రామస్తులంతా ఐక్యతతో ప్రశాంత వాతావరణంలో బోనాల ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. అమ్మవార్ల ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని సర్పంచ్ ఆకాంక్షించారు.

# సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ఏలూరులో పటిష్ట బందోబస్తు





ఏలూరు, ఆగస్టు 10, సందేశం టైమ్స్ ఏలూరు జిల్లా ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏలూరు జిల్లా కలిదిండి మండలంలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్ ప్రత్యేకంగా బ్రీఫింగ్ నిర్వహించి విధుల నిర్వహణపై పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఏలూరు రేంజ్ ఐజీ జి.వి.జి. అశోక్ కుమార్ ఐపీఎస్ బందోబస్తు ప్రాంతాలను స్వయంగా పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. సెక్టార్ల వారీగా పోలీసు సిబ్బందికి విధులు కేటాయించడంతో పాటు హెలిప్యాడ్, సభా వేదిక, గ్యాలరీలు, ముఖ్యమంత్రి కాన్వాయ్ వెళ్లే మార్గాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ప్రవేశ మార్గాలు, భవనాల పైకప్పులు, పార్కింగ్ ప్రాంతాలు, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలు, నియంత్రణ గది ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ సమయపాలన, సమన్వయంతో విధులు నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా పోలీసు అధికారులు సూచించారు.



## బీడకన్యలో అంగరంగ వైభవంగా పోచమ్మ తల్లి బోనాల పండుగ

ఝరాసంగం సందేశం టైమ్స్ ప్రతినిధి ఆగస్టు 10: సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బీడకన్య గ్రామంలో పోచమ్మ తల్లి బోనాల పండుగను గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ నాగదేవత ఉపాసకురాలు జయమ్మ మాతాజీ బీడకన్య గ్రామానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు, మహిళలు, చిన్నారులు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలు తీసుకుని అమ్మవారిని కొలిచి, గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. బోనాల ఉత్సవాల సందర్భంగా గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది. అమ్మవారి ఆశీస్సులతో గ్రామం ఎల్లప్పుడూ సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని గ్రామ ప్రజలు కోరుకున్నారు. గ్రామస్తులంతా ఉత్సాహంగా పాల్గొని బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు.









## మరవెల్లిలో ఘనంగా రేణుక మాత బోనాలు

### గౌడ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాల సమర్పణ

వట్‌పల్లి మండల సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 10: సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం మరవెల్లి గ్రామంలో రేణుక మాత బోనాల ఉత్సవాలను గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గౌడ సంఘం అధ్యక్షుడు కలాలి మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో రేణుక మాతకు బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా శివసత్తుల భాజా భజంత్రీల నడుమ బోనాల ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రేణుక మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మరవెల్లి గ్రామ సర్పంచ్ పట్లల్ల మల్లేశ్వరమ్మ, రాజు పటేల్, మాజీ ఎంపీటీసీ తమన్నగారి సంఘన్న, మాజీ ఉపసర్పంచ్ సీహెచ్ బసవరాజ్, సంతోషం స్వామి, మేడికుంద కిరణ్, మాజీ విద్యా కమిటీ చైర్మన్ జుట్టు చిన్న నరసింహులు తదితరులు హాజరయ్యారు. అలాగే గౌడ సంఘం సభ్యులు టీ. నర్సింలు, తుల్జారం గౌడ్, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ నాయకులు, మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల వేడుకలను విజయవంతం చేశారు.

# గొర్రెకల్‌లో ఘనంగా రేణుక ఎల్లమ్మ బోనాలు





సంగారెడ్డి, సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి కె. సంగమేశ్వర్, ఆగస్టు 10: సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం గొర్రెకల్ గ్రామంలో రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి రేణుక ఎల్లమ్మ తల్లికి బోనాలు, వడిబియ్యం తదితర నైవేద్యాలను సమర్పించారు. శివసత్తుల చప్పుళ్లు, భక్తుల నినాదాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గౌడ సంఘం సభ్యులు, మహిళలు, యువకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.




# తెలంగాణలో నేటితో ముగియనున్న ఎస్ఐఆర్ గడువు

సందేశం టైమ్స్ అందోల్ మండల ప్రతినిధి వి. వెంకటేశం, జోగిపేట, ఆగస్టు 10: తెలంగాణలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు గడువు ఆగస్టు 10తో ముగియనున్నట్లు సమాచారం. దీంతో ఇప్పటివరకు ఫారాలు సమర్పించని ఓటర్లు వెంటనే తమ సంబంధిత బూత్ స్థాయి అధికారులను సంప్రదించి వివరాలు అందించాలని అధికారులు సూచిస్తున్నారు. గడువు ముగిసిన అనంతరం ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు అవకాశం ఉండకపోవచ్చని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో అర్హులైన ప్రతి ఓటరూ నిర్లక్ష్యం చేయకుండా తమ వివరాలను సరిచూసుకొని నిర్ణీత గడువులోగా ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచిస్తున్నారు. ఓటరు జాబితాలో పేరు, చిరునామా తదితర వివరాల్లో ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత బూత్ స్థాయి అధికారులను సంప్రదించి స్పష్టత పొందాలని కోరుతున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు గడువు ముగుస్తున్నందున ఓటర్లు అప్రమత్తంగా ఉండి తమ ఓటు హక్కుకు సంబంధించిన వివరాలను ధృవీకరించుకోవాలని అధికారులు సూచించారు.

# నిజాంపేట్‌లో ఘనంగా ముత్యాలమ్మ తల్లి బోనాల ఉత్సవాలు







సంగారెడ్డి, సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి కె. సంగమేశ్వర్, ఆగస్టు 10: నిజాంపేట్ 191 కాలనీలో శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ తల్లి బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిజాంపేట్ మాజీ కార్పొరేటర్ శ్రీమతి శనగల ప్రణయ్ ధనరాజ్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కాలనీ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఆలయ నిర్వాహకులు ఆమెకు ఘన స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఉదయం నుంచే మహిళలు, ఆడపడుచులు సంప్రదాయ దుస్తులు ధరించి శిరస్సుపై బోనాలు ఎత్తుకుని మంగళహారతులతో ఆలయానికి తరలివచ్చారు. డప్పు దరువుల మోతలు, శివసత్తుల పూనకాలు, భక్తుల జయజయధ్వానాలతో కాలనీ అంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా శనగల ప్రణయ్ ధనరాజ్ యాదవ్ మాట్లాడుతూ అమ్మవారి కృపాకటాక్షాలు కాలనీ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, అందరికీ సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. బోనాల ఉత్సవాలు కాలనీ సమైక్యతకు, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు, మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఒంగోలులో ఘనంగా మాదిగ ఉద్యోగుల సమాఖ్య 5వ జాతీయ మహాసభ



ప్రకాశం జిల్లా, ఒంగోలు, ఆగస్టు 10: ప్రకాశం జిల్లా ఒంగోలు కేంద్రంగా నిర్వహించిన మాదిగ ఉద్యోగుల సమాఖ్య (MEF) 5వ జాతీయ మహాసభకు ఆంధ్రప్రదేశ్‌లోని 28 జిల్లాలు, తెలంగాణలోని 33 జిల్లాల నుంచి వేలాది మంది మాదిగ ఉద్యోగుల ప్రతినిధులు భారీగా తరలివచ్చారు. మహాసభకు ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ అధినేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ హాజరయ్యారు. సభ ప్రారంభానికి ముందు మాదిగ అమరవీరులకు మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఒంగోలు కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయనకు మాదిగ ఉద్యోగులు పెద్ద ఎత్తున నినాదాలతో స్వాగతం పలికారు. సభా ప్రాంగణంలో ఉద్యోగులు నిర్దేశించిన దుస్తుల నిబంధనలను పాటించడం, మెడలో జాతీయ మహాసభ ప్రవేశ గుర్తింపు కార్డులతో హాజరు కావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జాతీయ ప్రతినిధులు, సభ్యులకు మాత్రమే సభలో ప్రవేశం కల్పిస్తూ నిర్వహణ కమిటీ క్రమశిక్షణతో ఏర్పాట్లు చేసింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన జిల్లా, రాష్ట్ర, జాతీయ నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించగా, వాటిని పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పరిశీలించారు. సభకు భారీగా హాజరైన ఉద్యోగులకు తాగునీరు, అల్పాహారం, టీ, భోజనం తదితర సౌకర్యాలను నిర్వాహకులు కల్పించారు. సభా ప్రాంగణం కిక్కిరిసిపోవడంతో కొంతమంది ఉద్యోగులు బయట నుంచే సమావేశ కార్యక్రమాలను ఆలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన మాదిగ ఉద్యోగులు తమ అధినేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ సందేశం కోసం ఆసక్తిగా ఎదురుచూశారు. మహాసభ అత్యంత క్రమశిక్షణతో కొనసాగిందని నిర్వాహకులు తెలిపారు.



# శ్రీ తిరుపతమ్మ తల్లిని దర్శించుకున్న ఉప్పలపాటి శ్రీనివాసరాజు

జగ్గయ్యపేట, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 10: హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యుడు ఉప్పలపాటి శ్రీనివాసరాజు పెనుగంచిప్రోలు శ్రీలక్ష్మి తిరుపతమ్మ తల్లి దేవస్థానాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనను బీజేపీ కన్వీనర్ మన్నె శ్రీనివాసరావు, జగ్గయ్యపేట టౌన్ అధ్యక్షుడు యాపంగు రాజా, ఆర్టీఐ ప్రతినిధి నాగేంద్రబాబు, వత్సవాయి మండల అధ్యక్షుడు పగడాల శ్రీనివాసరావు, పెనుగంచిప్రోలు మండల అధ్యక్షుడు కంభం నరసింహస్వామి, నందిగామ రూరల్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉప్పలపాటి శ్రీనివాసరాజుతో ఆత్మీయంగా మాట్లాడి పలు అంశాలపై చర్చించారు. అలాగే శ్రీలక్ష్మి తిరుపతమ్మ దేవస్థానం కోర్టు మెంబర్ కల్లూరి శ్రీవాణి కూడా ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. దేవస్థానానికి విచ్చేసిన ఉప్పలపాటి శ్రీనివాసరాజును నాయకులు, దేవస్థానం ప్రతినిధులు సాదరంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.




# జగ్గయ్యపేటలో అక్రమ కట్టడాలు, ఆక్రమణలపై అధికారుల మౌనం ఎందుకు?

ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 10: జగ్గయ్యపేట పట్టణంలో అక్రమ కట్టడాలు, ప్రభుత్వ స్థలాలు, రోడ్లు, ప్రజా ప్రయోజన స్థలాల ఆక్రమణలకు సంబంధించి ఎప్పటికప్పుడు ఆరోపణలు, ఫిర్యాదులు, స్థానికుల ఆవేదనలు వెలుగులోకి వస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందిస్తున్న తీరు ఏమిటన్న ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. పలు అంశాలపై మీడియా కథనాలు ప్రచురితమైనప్పటికీ వాటిపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారా, నోటీసులు జారీ చేశారా, ఆక్రమణలు లేదా అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు తేలితే ఎలాంటి చర్యలు తీసుకున్నారన్న దానిపై స్పష్టత లేదని స్థానికులు అంటున్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం మీడియా బాధ్యత కాగా, మీడియాలో వచ్చిన ఆరోపణలు వాస్తవమా కాదా అన్నది సంబంధిత శాఖలు అధికారికంగా పరిశీలించి ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా పేదలు, సామాన్యులు, బడుగు బలహీన వర్గాలకు సంబంధించిన సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. ఒక సమస్యపై వరుసగా వార్తలు వచ్చిన తర్వాత కూడా అధికారుల నుంచి స్పందన లేకపోతే ప్రజల్లో అనుమానాలు, అసంతృప్తి ఏర్పడే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలపై ఆరోపణలు వచ్చినప్పుడు సంబంధిత అధికారులు రికార్డులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు నిరాధారమైతే అధికారికంగా వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని కోరుతున్నారు. మీడియా కథనం వెలువడిందంటే అందులోని ప్రతి ఆరోపణ నిజమని భావించాల్సిన అవసరం లేదని, అదే సమయంలో వార్తలను పూర్తిగా పట్టించుకోకుండా వదిలేయడం కూడా సముచితం కాదని, నిజానిజాలను అధికారికంగా తేల్చాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని ప్రజలు అంటున్నారు. జగ్గయ్యపేటలో అక్రమ కట్టడాలు, ఆక్రమణలు మరియు ఇతర ప్రజా సమస్యలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమం ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు నిరాధారమైతే స్పష్టత ఇవ్వాలని, ముఖ్యంగా సామాన్య ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



# వైన్స్‌లో సిండికేట్ లేదంటారా.. క్వార్టర్ సీసాలపై స్టిక్కర్లు ఎందుకు?

అనంతగిరి, ఆగస్టు 10: అనంతగిరి మండల కేంద్రంలోని ఓ మద్యం దుకాణం నిర్వహణపై గ్రామాల్లోని బెల్ట్‌షాప్ నిర్వాహకులు, స్థానికులు పలు ఆరోపణలు చేస్తున్నారు. గ్రామాల్లో విక్రయించే మద్యం తమ వైన్‌షాప్ నుంచే కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తున్నారని, అందుకే ప్రతి క్వార్టర్ సీసాపై ప్రత్యేక స్టిక్కర్ వేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసిన మద్యం సీసాలపై స్టిక్కర్లు లేకపోతే తమ అనుచరులతో తనిఖీలు చేయించి వాటిని స్వాధీనం చేసుకుంటున్నారని బెల్ట్‌షాప్ నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. దీంతో తాము స్వేచ్ఛగా వ్యాపారం చేసుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు వాపోతున్నారు. సిండికేట్ లేదని చెబుతున్నప్పటికీ క్వార్టర్ సీసాలపై ప్రత్యేక స్టిక్కర్లు ఎందుకు వేస్తున్నారనే ప్రశ్నలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి. మరోవైపు వైన్‌షాప్ ప్రధాన చౌరస్తాలో ఉండటంతో మద్యం సేవించిన వారు రోడ్డుపైకి రావడం వల్ల తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు చెబుతున్నారు. అదే ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాలు, రద్దీ ప్రదేశాలు ఉండటంతో మహిళలు, విద్యార్థులు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్వార్టర్ సీసాలపై స్టిక్కర్ల వ్యవహారం, బెల్ట్‌షాప్‌లపై జరుగుతున్నట్లు చెబుతున్న తనిఖీలపై ఎక్సైజ్ అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు విచారణలో తేలితే సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



## జేడీ వాన్స్‌తో ఫోన్‌లో ప్రధాని మోదీ సంభాషణ

న్యూఢిల్లీ, సందేశం టైమ్స్ ప్రతినిధి ఆగస్టు 10: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా భారత్–అమెరికా సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యంతో పాటు ఇరు దేశాల మధ్య కీలక రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించే అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా అభిప్రాయాలను పంచుకున్నారు. ఇదిలా ఉండగా, జేడీ వాన్స్, ఆయన భార్య ఉషా వాన్స్‌కు కుమారుడు జన్మించిన సందర్భంగా ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. వాన్స్ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, నూతన శిశువుకు మంచి ఆరోగ్యం, సంతోషకరమైన భవిష్యత్తు కలగాలని ఆకాంక్షించారు.

## గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు మన సమాజానికి గర్వకారణం: సీఎం చంద్రబాబు





విజయవాడ, ఆగస్టు 10: అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గిరిజన సోదరసోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అడవితో, ప్రకృతితో ముడిపడి ఉన్న గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, విశిష్టమైన జీవన విధానం సమాజానికి ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. అవకాశం కల్పిస్తే గిరిజనులు అద్భుతాలు సృష్టించే శక్తి కలిగి ఉన్నారని అన్నారు. గిరిజన మహిళ ద్రౌపది ముర్ము భారత రాష్ట్రపతిగా కొనసాగుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, త్వరలో దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోబోతున్న తరుణంలో ఇది దేశానికి గర్వకారణమని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని ఆదివాసీ సోదరసోదరీమణులందరికీ మరోసారి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.




## స్పెక్ట్రమ్ ఛార్జీల వివాదం.. ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలకు సుప్రీంకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ, ఆగస్టు 10: వన్‌టైమ్ స్పెక్ట్రమ్ ఛార్జీలను రద్దు చేస్తూ బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని భారతి ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలకు నోటీసులు జారీ చేసింది. అయితే బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ప్రస్తుతం సుప్రీంకోర్టు స్టే విధించకపోవడంతో టెలికాం సంస్థలకు తాత్కాలికంగా ఊరట లభించింది. కేంద్రం దాఖలు చేసిన పిటిషన్‌పై తదుపరి విచారణలో సుప్రీంకోర్టు ఈ అంశంపై మరింత స్పష్టత ఇవ్వనుంది.




## సిద్ధార్థ్‌నగర్‌లో రూ.311 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శ్రీకారం

సిద్ధార్థ్‌నగర్, ఆగస్టు 10: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి గ్రామం, పేద, రైతు, యువతకు చేరేలా చర్యలు కొనసాగుతున్నాయని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. బుద్ధ భగవానుడి పవిత్ర భూమిగా పేరొందిన సిద్ధార్థ్‌నగర్ జిల్లాలోని డుమరియాగంజ్, బాంసీ శాసనసభ నియోజకవర్గాల పరిధిలో రూ.311 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టిన 107 అభివృద్ధి ప్రాజెక్టులకు లోకార్పణ, శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రజా సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభం కావడం, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందుతున్న నేపథ్యంలో జిల్లా ప్రజలకు, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.

## “రాజకీయాలకు అతీతంగా నిధుల పంపిణీ.. తెలంగాణతో పాటు అన్ని రాష్ట్రాల సమన్వయమే కేంద్రం బాధ్యత”

తెలంగాణకు కేంద్ర నిధులు.. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాల సమన్వయమే కీలకం

హైదరాబాద్, ఆగస్టు 10: తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం లేకపోవడం వల్ల కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తగిన స్థాయిలో నిధులు కేటాయించడం లేదని రాష్ట్రంలోని పలువురు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు తరచూ విమర్శలు చేస్తుంటారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం మాత్రం రాష్ట్రాలకు నిధుల కేటాయింపు రాజకీయ అనుబంధాల ఆధారంగా కాకుండా రాజ్యాంగ నిబంధనలు, ఆర్థిక సంఘం సిఫార్సులు, కేంద్ర పథకాల మార్గదర్శకాలు, రాష్ట్రాల అవసరాలు వంటి అంశాల ఆధారంగా జరుగుతాయని చెబుతోంది. ఈ నేపథ్యంలో కేంద్ర-రాష్ట్ర సంబంధాల్లో రాజకీయ విభేదాలకు అతీతంగా దేశంలోని అన్ని రాష్ట్రాలను సమన్వయం చేసుకుని సమాన అభివృద్ధి దిశగా తీసుకెళ్లడం కేంద్ర ప్రభుత్వానికి అత్యంత కీలకమైన బాధ్యతగా నిలుస్తోంది.

రాష్ట్రాలకు నిధులు ఎలా చేరుతాయి?

కేంద్రం నుంచి రాష్ట్రాలకు నిధులు ఒకే విధానంలో కాకుండా వివిధ మార్గాల్లో చేరుతాయి. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటా, కేంద్ర ప్రాయోజిత పథకాలు, కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక పథకాలు, మౌలిక వసతుల ప్రాజెక్టులు, వివిధ మంత్రిత్వ శాఖల కేటాయింపులు, ఆర్థిక సంఘం సిఫార్సుల ఆధారంగా వచ్చే నిధులు వంటి పలు మార్గాలు ఉన్నాయి. రాష్ట్రాల మధ్య పన్నుల పంపిణీలో జనాభా, ఆదాయ దూరం, విస్తీర్ణం, అటవీ విస్తీర్ణం, జనాభా మార్పులు, పనితీరు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకునే వ్యవస్థ ఉంది. అందువల్ల ఒక రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉందనే ఒక్క అంశం ఆధారంగా కేంద్ర నిధుల మొత్తం నిర్ణయించబడదని కేంద్రం వాదిస్తోంది.

తెలంగాణ వాదన ఏమిటి?

తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌తో పాటు పలువురు రాష్ట్ర నాయకులు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పన్నుల వాటా, కేంద్ర పథకాల నిధులు, రాష్ట్రానికి సంబంధించిన ప్రత్యేక ప్రాజెక్టుల విషయంలో మరింత సహకారం అందించాలని కోరుతున్నారు. రాష్ట్రానికి సంబంధించిన సాగునీటి ప్రాజెక్టులు, రహదారులు, రైల్వేలు, పారిశ్రామిక మౌలిక వసతులు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, పట్టణాభివృద్ధి వంటి అంశాల్లో కేంద్రం మరింత సహకరించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. తెలంగాణకు రావాల్సిన నిధుల విషయంలో కేంద్రం తగినంత సహకారం అందించడం లేదనే రాజకీయ విమర్శలు కూడా ఈ నేపథ్యంలోనే వినిపిస్తున్నాయి.

కేంద్రం సమాధానం ఏమిటి?

కేంద్ర ప్రభుత్వ దృష్టిలో దేశంలోని ప్రతి రాష్ట్రం భారత సమాఖ్య వ్యవస్థలో సమాన భాగస్వామి. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉందనే కారణంతో అభివృద్ధి నిధులను నిలిపివేయడం లేదా తగ్గించడం రాజ్యాంగబద్ధమైన విధానం కాదని కేంద్రం తరచూ స్పష్టం చేస్తోంది. కేంద్ర పథకాలకు సంబంధించిన నిధులు నిర్ణీత మార్గదర్శకాల ప్రకారం విడుదలవుతాయని, రాష్ట్రాలు తమ వాటాను సమకూర్చడం, వినియోగ ధ్రువపత్రాలు సమర్పించడం, ప్రాజెక్టులను నిర్దేశిత కాలంలో అమలు చేయడం కూడా కీలకమని కేంద్రం పేర్కొంటోంది.

రాజకీయ భేదాలు ఉన్నా అభివృద్ధి ఆగకూడదు

కేంద్రంలో ఒక పార్టీ, రాష్ట్రంలో మరో పార్టీ అధికారంలో ఉండటం భారత రాజకీయ వ్యవస్థలో సాధారణమే. తెలంగాణలో బీజేపీ అధికారంలో లేకపోవడం రాజకీయ వాస్తవం కాగా, కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం ఉండటం మరో వాస్తవం. ఈ రెండు వాస్తవాల మధ్య ప్రజల ప్రయోజనాలు నలిగిపోకుండా కేంద్రం, రాష్ట్రం పరస్పర సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది. కేంద్రం నిధులు కేటాయించాలి, రాష్ట్రం వాటిని సమర్థంగా వినియోగించాలి. కేంద్ర పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలి; రాష్ట్ర అవసరాలను కేంద్రం సానుకూలంగా పరిశీలించాలి. అప్పుడే సమాఖ్య స్ఫూర్తి బలపడుతుంది.

రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత కూడా కీలకమే

కేంద్రం నుంచి నిధులు రావడం మాత్రమే అభివృద్ధికి సరిపోదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రాజెక్టుల కోసం అవసరమైన భూసేకరణ, రాష్ట్ర వాటా నిధులు, పరిపాలనా అనుమతులు, పర్యావరణ అనుమతులు, వినియోగ ధ్రువపత్రాలు, పనుల పురోగతి నివేదికలు వంటి అంశాలను సమయానికి పూర్తి చేయాల్సి ఉంటుంది. కేంద్ర పథకాల నిధులు ఆలస్యమైతే వాటి కారణాలను అధికారికంగా వివరించి కేంద్రంతో చర్చించి పరిష్కరించుకోవాల్సిన బాధ్యత కూడా రాష్ట్ర ప్రభుత్వంపై ఉంటుంది.

కేంద్రానికి రాజకీయాలకు అతీతంగా వ్యవహరించే పరీక్ష

ఒక రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలో ఉందా లేదా అన్నదానికంటే, అక్కడి ప్రజలకు ఏ అవసరాలు ఉన్నాయన్నదే కేంద్ర ప్రభుత్వానికి ప్రధాన ప్రమాణంగా ఉండాలి. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కేంద్రంతో రాజకీయ విభేదాలను పక్కనపెట్టి రాష్ట్ర ప్రయోజనాల కోసం సమర్థవంతమైన చర్చలు జరపాలి. ముఖ్యంగా జాతీయ ప్రాజెక్టులు, రైల్వేలు, జాతీయ రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, పారిశ్రామిక కారిడార్లు, రక్షణ రంగ పెట్టుబడులు, విద్యా సంస్థలు వంటి అంశాల్లో కేంద్ర-రాష్ట్ర సమన్వయం అత్యవసరం.

అన్ని రాష్ట్రాలు సమానంగా అభివృద్ధి చెందితేనే వికసిత్ భారత్

దేశ అభివృద్ధి అంటే కొన్ని రాష్ట్రాలు మాత్రమే ముందుకు వెళ్లడం కాదు. దక్షిణాది రాష్ట్రాలు, ఉత్తరాది రాష్ట్రాలు, ఈశాన్య రాష్ట్రాలు, పశ్చిమ రాష్ట్రాలు, చిన్న రాష్ట్రాలు, పెద్ద రాష్ట్రాలు అన్న తేడా లేకుండా ప్రతి ప్రాంతానికి అభివృద్ధి అవకాశాలు కల్పించాల్సి ఉంటుంది. రాష్ట్రాల మధ్య అభివృద్ధి అంతరాలను తగ్గించడం, వెనుకబడిన ప్రాంతాలకు అదనపు మద్దతు ఇవ్వడం, పెట్టుబడులు ఆకర్షించడం, ఉపాధి అవకాశాలు పెంచడం కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి బాధ్యత.

తెలంగాణకు కావాల్సింది రాజకీయ పోరాటం కంటే నిధులపై స్పష్టత

తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన ప్రతి రూపాయిపై రాష్ట్ర ప్రభుత్వం అధికారిక లెక్కలు ప్రజల ముందుంచితే ప్రజలకు వాస్తవ పరిస్థితి స్పష్టమవుతుంది. కేంద్రం కూడా రాష్ట్రానికి కేటాయించిన నిధులు, విడుదల చేసిన నిధులు, పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలు, రాష్ట్ర వాటా అవసరమైన పథకాలు వంటి వివరాలను పారదర్శకంగా వెల్లడిస్తే రాజకీయ ఆరోపణలకు అవకాశం తగ్గుతుంది. ‘బీజేపీ ప్రభుత్వం లేదు కాబట్టి నిధులు రావడం లేదు’ అనే వాదన అయినా, ‘రాష్ట్ర ప్రభుత్వం నిధులను సక్రమంగా వినియోగించడం లేదు’ అనే ప్రత్యారోపణ అయినా ఆధారాలతోనే ప్రజల ముందుకు రావాల్సిన అవసరం ఉంది.

ప్రజల ప్రశ్న ఒక్కటే.. నిధులు ఎవరి కోసం?

కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా, రాష్ట్రంలో ఏ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసినా ప్రభుత్వాల అసలు లక్ష్యం ప్రజల సంక్షేమమే. కేంద్రం తెలంగాణకు న్యాయమైన వాటా, అవసరమైన సహకారం అందించాలి. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో సమన్వయం చేసుకుని ప్రతి పథకం, ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన నిధులను సమర్థంగా సాధించాలి. రాజకీయ విభేదాలు ఎన్నికల వరకు ఉండవచ్చు.. కానీ అభివృద్ధి మాత్రం ఆగకూడదు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర విమర్శలకంటే పరస్పర సహకారానికి ప్రాధాన్యం ఇచ్చినప్పుడే తెలంగాణతో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాలు సమానంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నెంబర్: TGTEL/25/A0348, టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ-మెయిల్ : sandeshamtimes@gmail.com, : www.sandeshamtimes.com, (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్ SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522006.